


# కైవల్యం

# కాకతాళీయం

ప్రొఫెసర్ మిడతంభొట్లు నోబెల్ బహుమానం సంపాదించిన తొలి తెలుగు వాడు. నలిగి పోయిన బట్టలు, ఉడతలు పీకిన తాటి టెంకలా జుత్తుతో చూడ్డానికి అపర అయిన్‌స్టయిన్‌లా ఉంటాడు. అతి నిదానంగా మాట్లాడే తత్వం. ఏదయినా ప్రశ్న అడగండి. ముందు మూడు నిమిషాల వరకు నోట మాట రాదు. నోరు విప్పి, వాక్యం మధ్యలో ఆపేసి, రెండు నిమిషాలు ఆలోచించి, మరో రెండు మాటలు చెబుతాడు.

నేను ఒక పత్రికా విలేఖరిని. మిడతంభొట్లు మేష్టారికి నోబెల్ బహుమానం రాక ముందే ఆయనతో ఉన్న పరిచయం వల్ల, చాల తడవలు ఆయనతో ముఖాముఖీ జరిపిన గోష్ఠి వల్ల సంపాదించిన స్వానుభవంతో చెబుతున్నాను.

``అయ్యా, రేపు ఉదయం సూర్యుడు తూర్పున ఉదయిస్తాడా?'' అని అతి సామాన్యమయిన ప్రశ్న వేసేమనుకొండి. దానికి మిడతంభొట్లు సమాధానం ఇలా ఉంటుంది.

``మన సూర్యుడా....? తూర్పున ఉదయించడమా? ఈశాన్య దిశలో ఉదయిస్తే అది తూర్పు కింద లెక్కకి వస్తుందా? అసలు ఉదయించడం అంటే సూర్యబింబపు అంచు దిక్చక్రం మీద మొట్టమొదట కనిపించడమా, లేక బింబం అంతా గుండ్రంగా కనిపించడమా...?'' అంటూ ఆలోచనలో పడిపోయి, వాక్యాన్ని అసంపూర్ణంగా ఆపేస్తాడు. ఆయన తర్జనభర్జనలు తెగతెంపులు అయేసరికి తూర్పు తెల్లారి పోతుంది.

సత్యశోధన, సత్యసాధన, ఈ రెండే ఆయన పరమార్థాలు. అటువంటి మిడతంభొట్లు ఖూనీ చేసేడన్న అనుమానం నాకు స్ఫురించగానే నా విచక్షణా జ్ఞానం మీద నాకే రోత పుట్టింది. ఒక కీలకమయిన పరిస్థితిలో ఆయన బుర్రలోని ఆలోచనలు మీన మేషాలు లెక్క పెట్టకుండా పంచకళ్యాణి గుర్రంలా పరిగెత్తి ఉండాలి. అలా కాని పక్షంలో ఈ ఖూనీ అసాధ్యం.

ఒక వేళ నా అనుమానమే నిజం అయినా, ఇప్పుడు చెయ్య గలిగేది ఏమీ లేదు. దీనికి రెండు కారణాలు. ఒకటి, నాకు తప్ప ఈ అనుమానం మరెవ్వరికీ రాలేదు. రెండు, చట్ట రీత్యా కేసుకి కాలదోషం పట్టేసిందో లేదో తెలియదు కాని, ప్రజల దృష్టిలో మాత్రం పట్టేసింది. అలాగని ఈ విషయాన్ని ఎన్నాళ్ళని లోపల దాచుకోను? పొట్ట ఉబ్బి చచ్చి పోనూ! కథ వివరంగా చెబుతాను. మీరే నిర్ణయించండి.

మిడతంభొట్లూ, రమేషూ నా చిన్ననాటి సహాధ్యాయులు. మిడతంభొట్లు అసలు పేరు నిడసనమెట్ల రామదాసు. రవంత చెవుడు ఉన్న మా మామ్మకి 'నిడసనమెట్ల' అన్న మాట సరిగ్గా వినిపించక 'మిడతంభొట్లా?' అంది ఒక సారి. అంతే!! ఆ పేరే స్థిరపడి పోయింది.

రమేష్ తల్లిదండ్రులు తెలంగాణా ప్రాంతం నుండి తరలి వచ్చి తునిలో స్థిరపడ్డారు. రమేష్ మంచి వ్యక్తిత్వము, స్ఫూర్తి ఉన్న మనిషి. ఆటలు బాగా ఆడే వాడు. మంచి వక్త

కూడా. చాకు లాంటి మనిషి. కాని చదువు మాత్రం అబ్బ లేదు. కొత్తపేటలో ఒకే వీధిలో ఉండే వాళ్లం. సెలవులు ఎప్పుడు వచ్చినా కేరం బోర్డు ఆడడం మా దినచర్యలో తప్పని పని. మిడతంభొట్లుకి ఆటలలో ఆసక్తి ఉండేది కాదు. ప్రావీణ్యత కూడా పూజ్యమే. కాని కేరం బోర్డు ఆటలో మాత్రం రమేషుకి లేశ మాత్రం తీసిపోయేవాడు కాదు.

రమేష్ ఆడే పద్ధతే వేరు. ప్రయాస పడకుండా, అలవోకగా, ఏ బిళ్ల ఏ జేబులోకి వెళుతుందో చెబుతూ, బిళ్లలని నిమిషాల మీద తుడిచి పారేసే వాడు. చూడ ముచ్చట వేసేది. మిడతంభొట్లో? ఒకొక్క బిళ్లని ఎంత జోరుగా, ఏ కోణంలో కొట్టాలో, రాపిడి తగ్గడానికి బల్ల మీద ఎంత పౌడరు వెయ్యాలో, ఇలా లెక్కలు కట్టి, నసిగి, నాన్చి, ఒకొక్క బిళ్లనీ జేబులలో వేసే వాడు. బోర్డు ఖాళీ అయేసరికి పది నిమిషాలు పట్టేది.

ఒక సారి వైజాగులో జిల్లా ఎత్తున జరిగిన పోటీలలో రమేష్ ప్రభృతులని ఓడించి వెండి కప్పు గెలుచుకున్నాడు, మిడతంభొట్లు. రెండవ స్థానంలో కాంస్య పతకం గెలుచుకున్న రమేషు ఇప్పటికీ అంటాడు – గేమ్ పాయింటు దగ్గర మిడతంభొట్లు మోసం చేసేడని. అది పోటీలలో ఆఖరి ఆట. ఆఖరి బిళ్లని జేబులో వేసే అవకాశం మిడతంభొట్లుకి వచ్చింది. కాని రమేష్ నల్లబిళ్ల అడ్డుగా ఉంది. దానిని తప్పించి తెల్లబిళ్లని కొట్టాలి. చూస్తూన్న జనాలంతా అది అసంభవం అన్నారు. మిడతంభొట్లు ఎంతసేపు ఆలోచించేడో చెప్పలేం. ఆ ఉత్కంఠ భరితమైన సమయంలో గోడ మీది బల్లి ఎవరి మీదనో పడడం, వారు కెవ్వున కేక వెయ్యడం, అదే సమయంలో మిడతంభొట్లు తన తెల్ల పిక్కని జేబులోకి కొట్టడం, అన్నీ లిప్త మాత్రంలో జరిగి పోయాయి. అడ్డుగా ఉన్న నల్ల పిక్కని మిడతంభొట్లు వేలుతో పక్కకి తోసేడని రమేష్‌కి అనుమానం. కాని అంత మంది మధ్యలో అంత పని చెయ్యడానికి ఒడిగడతాడా? – ఎంత తెగువ, సాహసం ఉన్న వాడయినా!

మిడతంభొట్లు, రమేషు ఉత్తర దక్షిణ ధ్రువాలు. చదువులో మిడతంభొట్లుది ఎప్పుడూ ప్రథమ స్థానమే. రమేష్ మాత్రం దినదిన గండంగా పరీక్షలని నెట్టుకుని వచ్చేవాడు. రమేష్ వాలకం గమనించి వాడిని వాళ్ల నాన్న తనతోపాటే వ్యాపారంలో తిప్పడం మొదలు పెట్టేడు. వ్యాపారంలో కిటుకులు సునాయాసంగా పసికట్టేసి 'తండ్రిని మించిన కొడుకు' అనిపించుకున్నాడు రమేష్. చదువంటే అబ్బ లేదు కాని సిరి అబ్బింది. మిడతంభొట్లు విద్వత్సభలలో పురస్కారాలు అందుకొంటే, రమేష్ పెద్ద పారిశ్రామిక వేత్తగా, రసాభౌకం (రసాయన, భౌతిక కంపెనీ) అధినేతగా, ఎన్నెన్నో పురస్కారాలు అందుకున్నాడు. కోటికి పడగలు ఎత్తించేడు.

భౌతిక, రసాయన శాస్త్రాలలో ఎవరయినా కొత్త సిద్ధాంతం కనిపెట్టేరంటే చాలు, రమేష్ దాన్ని వెంటనే ఆచరణలో పెట్టి ఏదో ఒక చిన్న ఉపకరణం చేసే వాడు. చేసి బజారులో అమ్మకానికి పెట్టే వాడు. పెట్టి పెట్టెల నిండా గణించే వాడు. మిడతంభొట్లు రాసిన పరిశోధన పత్రాలు తనకి అర్థం కాకపోయినా ఫరవా లేదనే వాడు. డాక్టరేటు పట్టాలున్న మేధావులకి పెద్ద పెద్ద జీతాలిచ్చి, వాళ్ల సహాయంతో మిడతంభొట్లు సిద్ధాంతాలలోని

అంతరార్ధాలని కూలంకషంగా అర్ధం చేసికొని, ఆయన కూడా ఊహించని విధంగా, ప్రజానీకానికి అనేక విధాలుగా ఉపయోగ పడే ఉపకరణాలని తయారు చేసి పెద్ద పేరు తెచ్చుకున్నాడు. మిడతంభొట్లు ఏదో చేసేడని అందరికీ తెలుసు; రమేష్ ఏమిటి చేసేడో అందరికీ తెలుసు. అదీ వీళ్లిద్దరికీ తేడా.

అవి మిడతంభొట్లు నోబెల్ బహుమానం అందుకున్న కొత్తరోజులు. అయిన్‌స్టయిన్ అంతటి వాడికి కొరుకు పడని సమస్యని ఇతగాడు సాధించేడుట. అందుకని నోబెల్ బహుమానం ఇచ్చేరుట. ఆమాత్రం సామాన్యులందరికీ గ్రాహ్యం అయింది. కానీ, నిజంగా మిడతంభొట్లు ఏమిటి కనిబెట్టేరో సామాన్యులకి అర్ధం అయ్యే రీతిలో చెప్పాలంటే కొంచెం కష్టమే.

చిన్నతనం నుండీ సైన్సులో వ్యాసాలూ, జనరంజకమైన శైలిలో కల్పిత కథలూ రాసే అలవాటు నాకుంది. అందుకని మిడతంభొట్లు గారిని ఇంటర్‌వ్యూ చేసి ఆయన లేవదీసిన ద్వంద్వ క్షేత్ర సిద్ధాంతాన్ని ప్రజలకి అర్ధం అయే శైలిలో వ్యాసాలు రాసి ప్రచురించమని మా పత్రిక వారు నాకు పురమాయింపు ఇచ్చేరు.

నాలాంటి పత్రికా విలేఖరి ఒకాయనకి అయిన్‌స్టయిన్ ప్రతిపాదించిన సాపేక్ష సిద్ధాంతంలోని అంతరార్ధం ఎంతకీ అర్ధం కాక, ఆయననే తరుణోపాయం అడిగేడుట. ''అందమయిన అమ్మాయితో కబుర్లు చెబుతూ కూర్చుంటే రోజులు నిమిషాలలా గడచి పోతాయి. అదే బోటనీ పాఠం బోరు భరించలేని వాడికి గంటలు యుగాలులా అనిపిస్తాయి'' అని అర్ధం వచ్చే మాటలతో చమత్కరించేరుట, అయిన్‌స్టయిన్. ప్రజా బాహుళ్యం యొక్క పిపాస తీర్చడానికి ఇలాటి పిట్టకథ చాలు; సిద్ధాంతం లోని ఒంపు సొంపులన్నీ విడమర్చి చెప్పనక్కర లేదు.

ఇలాంటిదే ద్వంద్వక్షేత్ర సిద్ధాంతానికి సంబంధించిన పిట్టకథ ఏదయినా ఒకటి మిడతంభొట్లు దగ్గర సంపాదించ లేకపోతానా అన్న ఆశ నా మనస్సులో ఉంది. కాని ఆయన నసుగుడు, నాన్చుడు భరించ గలగాలి. జనరంజకమయిన కథ కావాలనుకుంటే ఆయన్ని కొంచెం రెచ్చ గొట్టాలి. అందుకని,

''మేష్టారూ, మీరు ప్రతిపాదించిన ద్వంద్వ క్షేత్ర సిద్ధాంతం నిజమయితే, దానికి పర్యవసానంగా, భూమి యొక్క ఆకర్షణ శక్తికి విరుగుడుగా మరొక ప్రతి శక్తిని సృష్టించ వచ్చని అభిజ్ఞ వర్గాలలో అనుకుంటున్నారు. అంటే, ఆ సందర్భంలో భూమి యొక్క ఆకర్షణ శక్తి నశించాలి కద. ఇలా గురుత్వాకర్షణ ఏష్యం అవడం సాధ్యమేనంటారా?'' అని అడిగేను.

ముక్కు మీద నుండి జారి పోతూన్న కండ్లజోడుని పైకి ఎగదోస్తూ, నన్ను ఎగా, దిగా ఒక సారి చూసి, ''భూమి యొక్క ఆకర్షణ శక్తి నశింప చేయడం అన్నా, గురుత్వాకర్షణని ఏష్యం చెయ్యడం అన్నా 'ఏంటీ గ్రెవిటీ' ని సృష్టించడం. అవునంటావా?''

అవునని తల ఊపేను. చిన్ననాటి స్నేహితుడే అయినా, ప్రపంచ విజ్ఞాన రంగంలో తారాపథాన్ని అందుకున్న మిడతంభొట్లుని ఏకవచనంతో సంబోధించడానికి జంకే వాడిని.

కాని ఆయన నన్ను నువ్వు అని సంభోధించడం నా ప్రోద్భలం వల్లనే. ఈ పరిచయాన్ని వాడుకునే విజ్ఞాన విలేఖరిగా నియామకం సంపాదించేను.

'' 'అప్పులడిగే అప్పారావులని ఎలా తప్పించుకోలేమో, అలాగే ఈ గురుత్వాకర్షణ గుప్పిట్లోంచి ఏదీ తప్పించుకో లేదు. గురుత్వాకర్షణ ఒక నీడ లాంటిది. అది సర్వవేళ సర్వావస్థలయందు మనని వెన్నంటి తిరుగుతూ ఉంటుంది' అని మీరే ఒక సారి అన్నారు కదా! మరి మీ ద్వంద్వ క్షేత్ర సిద్ధాంతం ప్రకారం గురుత్వాకర్షణ బారినుండి తప్పించుకుందికి వీలుగా యంత్రాలు నిర్మించి, వాటితో విద్యుశ్చక్తి భారీగానూ, చవగ్గానూ ఉత్పత్తి చెయ్యవచ్చని ప్రజలు అనుకుంటున్నారు. మీ అభిప్రాయం ఏమిటో చెబుతారా?''

''ఏంటీ గ్రేవిటీ! నాస్తి గురుత్వం? నా ద్వంద్వ క్షేత్ర సిద్ధాంత సమీకరణాలని ఎటువంటి ప్రహరాంక్షలతో పరిష్కరిస్తే ఏకైకత్వం లేకుండా పరిమితమైన సమాధానం వస్తుందో? అలాంటి పూరణం లేని పక్షంలో... ఏంటీ గ్రేవిటీకి సావకాశం లేదేమో.... ఉన్నా, రీమాన్ క్షేత్రంలో ...''

ఇది ఇప్పట్లో తేలే విషయం కాదని నాకు తెలుసు. ఈ సైన్సు భాష ఎంత విన్నా నాకు అర్థం అయి చావదు. ఈ తర్జన భర్జనలు అయేసరికి తెల్లారి పోతుంది. నేరక పోయి అడిగేనురా భగవంతుడా. మధ్యలో లేచి వెళ్లిపోతే మర్యాదగా ఉండదు. అయన మన లోకంలో లేడు. ఎందుకేనా మంచిదని నేనే కలుగ జేసుకొని, ఒక సారి గొంతుక సవరించుకొని అన్నాను.

''...ద్వంద్వ క్షేత్ర సిద్ధాంతపు సమీకరణాలని ఉపయోగించి ఏంటీ గ్రేవిటీ సృష్టించ వచ్చని రమేష్ అంటున్నాడండి''

''వ్యాపార సరళి తెలిసిన వ్యక్తి. ప్రజలకి ఏది కావాలో తెలిసికొని అది తయారు చేసి వాళ్లకి అమ్మగల సమర్థుడు. బాగా గణిస్తున్నాడని విన్నాను...''

ఈ సమాధానం నన్ను ఆశ్చర్య చకితుణ్ణి చేసింది. అన్న మాటలు కాదు. పలికిన విధానం. మాట తడుముకోకుండా, మూడు వాక్యాలు – చిన్న చిన్న వాక్యాలే అనుకోండి – ఒక్కుమ్మడి ఆయన అలా అనడం అదే మొదటి సారిగా నేను వినడం. ఇంకొక విచిత్రం ఏమిటంటే, నేను అడిగిన ప్రశ్న ఒకటి, ఆయన చెప్పిన సమాధానం మరొకటి. ఈ డొంక తిరుగుడు సమాధానం లోని అంతరార్థం ఏమిటా అని నేను ఇంకా ఆలోచిస్తూ ఉండగానే మిడతంభొట్లు మళ్లా అందుకున్నారు.

''విద్యావంతుడికి వినయమే సంపన్నం. డబ్బు చేదని అనను. ధనం మూలం మిదం జగత్ అన్నారు. కాని, విజ్ఞాన వేత్తలు విత్త వాంఛనీ, విజ్ఞాన కాంక్షనీ సమ దృష్టితో చూడ గలగాలి...''

ఈయన ఈ మధ్య కొంచెం భగవద్గీత వల్ల ప్రభావితుడు అవుతూన్న వాడిలా కనబడుతున్నాడు. మిడతంభొట్లు మాటలలో బహిర్గతంగా కనిపించే అర్థంతో పాటు కొంచెం అంతర్గతమైన వ్యంగ్యం ఉందా అనిపించింది. లేక రమేష్ అయిస్వర్యం చూసి ఈర్ష్య పడుతున్నాడా? కష్టపడి సిద్ధాంతాలని కనిపెట్టింది ఈయన. దానికి ఫలితంగా నోబెల్

బహుమానం వచ్చింది నిజమే. కాని బహిరంగంలో లభ్యమయే ఈ సిద్ధాంతాలని వాడుకుని, వాటిమీద పేటంట్లు సంపాదించి, రమేష్ దోసిళ్లతో గణిస్తూన్న దానితో పోల్చి చూస్తే నోబెల్ బహుమానం ఏపాటిది? హస్తిమశకాంతరం! ఈ విశ్లేషణ అంతా నా స్వకపోల కల్పితమేస్మండీ. మిడతంభొట్లు మనస్సులో దూరి ఆయన అంతరంగిక భావాలని కనుక్కునే స్థోమత నాకు లేదని నాకు తెలుసు.

"నేనిలా అంటున్నానని నన్ను అపార్థం చేసికో వద్దు. రమేషు, నేను, - మనం అంతా - బాల్య స్నేహితులం. రివాజు తప్పకుండా కేరమ్సు ఆడే వాళ్లం. రమేషుని చిపయోగించి ఏంటీ గ్రేవిటీ సృష్టిస్తాననీ, భూమి యొక్క ఆకర్షణ శక్తికి విరుగుడు కనిపెడతాననీ రమేష్ అంటున్నాడండి. నెగ్గుకు రాగలడంటారా?"

"చూడు నాయనా! ఏంటీ గ్రేవిటీ అంటే ఏమిటో అర్థం కావాలంటే ముందు గ్రేవిటీ అర్థం కావాలి. గ్రేవిటీ అంటే గురుత్వాకర్షణ. పుద్గాలం, లేదా గురుత్వం, లేదా భారీతనం ఉన్న పదార్థాలన్నిటికి ఈ ఆకర్షణ ఉంటుంది. భారీతనం ఎంత ఎక్కువ ఉంటే ఈ ఆకర్షణ అంత ఎక్కువగా ఉంటుంది. అందుకనే గురుత్వాకర్షణ అన్నారు. కొబ్బరి బొండాం చెట్టుని వీడి నేల మీద పడుతోందంటే దానికి కారణం భూమికున్న గురుత్వాకర్షణే. చంద్రుడు భూమి చుట్టూ తిరగడానికీ, గ్రహాలన్నీ గతులు తప్పకుండా సూర్యుడి చుట్టూ పరిభ్రమించడానికీ కారణం ఈ గురుత్వాకర్షణే. అయిన్‌స్టయిన్ యొక్క సాధారణ సాపేక్ష సిద్ధాంతం ప్రకారం..."

ఇహ ఈయన పురాణం విప్పుతూన్నట్లున్నాడు. ఇది ఇంతకు పూర్వం విన్న ఊక దంపుడే. కాని మధ్యలో ఆపేనంటే మంత్రం చదువుతూన్న పురోహితుణ్ణి ఆపినట్లవుతుంది. ఆలోచనకి అంతరాయం వచ్చిందని మళ్లా మొదటినుండీ లంకించుకుంటాడు. అందుకని నోరు మెదపకుండా, కుదురుగా కూర్చుని సావధానంగా వినడం మొదలు పెట్టేను.

"... గురుత్వాకర్షణని ఊహించుకోవడం ఎలాగో చెబుతాను, విను. దిట్టంగా ఉన్న ఒక పెద్ద జంబుఖానాని నాలుగు పక్కలా సాగదీసి పట్టుకున్నాం అనుకుందాం. ఇదే మన గురుత్వాకర్షణ క్షేత్రం. ఇప్పుడు ఈ క్షేత్రంలో భారీగా ఉన్న ఒక బంతిని ఉంచేమని అనుకుందాం. ఎక్కడ ఉంచేమో అక్కడ జంబుఖానాకి లొత్త పడుతుంది. బంతి ఎంత భారీదయితే అంత పెద్ద లొత్త పడుతుంది.

"ఈ విశ్వం ఒక పెద్ద రబ్బరు జంబుఖానా లాంటిది. సూర్యుడు, నక్షత్రాలు, గ్రహాలు భారం ఉన్న బంతుల లాంటివి. కనుక ఈ నక్షత్రాలు, గ్రహాలు ఉన్న చోట మన జంబుఖానా లొత్తలు పడుతుంది. పిండి కొద్దీ రొట్టెలా కొన్ని పెద్ద లొత్తలు, కొన్ని చిన్న లొత్తలు. ఇలా లొత్తలతో నిండిన విశ్వం లోకి ఒక గోళీని విసిరేమనుకుందాం. అది దొర్లుకుంటూ వెళ్లి ఏదో ఒక లొత్త దగ్గర స్థిరపడుతుంది. మన జంబుఖానా, అందులోని లొత్తలు నిజమయినవి కావు, మన ఊహాజనితాలు. ఈ లొత్తల దగ్గరకి దొర్లుకుంటూ వెళ్లిన గోళీని చూసి న్యూటన్ ఏమనుకున్నాడు? గ్రహం గోళీని ఆకర్షిస్తున్నాదని అనుకున్నాడు.

న్యూటన్ అనుకున్నది రజ్జు సర్ప భ్రాంతి లాంటి భ్రమ మాత్రమే అంటారు అయిన్‌స్టయిన్. ఒంపులు తిరిగిన గురుత్వాకర్షణ క్షేత్రంలో జారుతూన్న గోళీని చూసి ఆ గోళీని ఏదో ఆకర్షిస్తున్నాదని అనుకోవడం ఉత్త భ్రమ అన్నారు అయిన్‌స్టయిన్."

ఇంత వరకు కొట్టిన పిండిని మళ్లా కొట్టడం కనుక ఉపన్యాసం అనర్గళంగానే సాగింది. గుక్క తిప్పుకొనడానికి ఆగినట్లున్నారు. కథ చెబుతూన్నప్పుడు ఊకొట్టకపోతే బాగుండనట్లే, ఏమీ అనకపోతే బాగుండదని, నేనే కలుగజేసుకొని అన్నాను.

"వెనకటికి ఒక అరణ్యంలో ఒక గురువుగారు తమ శిష్యవరమాణువులకి వేదాంత బోధ చేస్తూన్న సందర్భంలో ఒక మదించిన ఏనుగు వీరి ఆశ్రమం వేపే పరిగెత్తుకుని వస్తున్నాదిట. శిష్యపరమాణువులు భయపడి పరుగు లంకించుకున్నారుట. వారి భయాన్ని చూసి గురువు గారు మందస్మిత వదనారవిందంతో, `గజం మిథ్య, గజం మిథ్య` – అంటే ఏనుగు మన భ్రమే సుమా – అని మెట్ట వేదాంతపు ధోరణిలో ధైర్యం చెప్పేరుట. ఆ ఏనుగు ఆగకుండా ఆశ్రమం వేపే జోరుగా వస్తూ ఉంటే మన గురువుగారు కూడ కాలికి బుద్ధి చెప్పేరుట. పరిస్థితి కుదుట పడ్డ తర్వాత `అయ్యా, గజం మిథ్య అన్నారే మరి తమరెందుకు పలాయన మంత్రం పఠించేరు?` అని ఒక శిష్యుడు తెగించి అడిగీసేట్ట. దానికి మన గురువుగారు సమాధానంగా `గజం మిథ్య, పలాయనం మిథ్య` అని చిరునవ్వుతో సెలవిచ్చేరుట. అలా ఉంది మీరు చెప్పినది."

నా పిట్టకథతో ఆయన తన ఏకాగ్రతకి అంతరాయం కలిగించ తల్చుకో లేదన్నట్లు మళ్లా అందుకున్నారు.

"ఏంటీ గ్రేవిటీని సృష్టించడం అంటే మన జంబుఖానా విశ్వంలో ఉన్న లొత్తలని తీసేసి జంబుఖానాని సాపు చెయ్యడం. ఇలా గురుత్వాకర్షణ క్షేత్రాన్ని సాపు చెయ్యడం సుసాధ్యమయిన పని కాదు..."

"...మరి మీ ద్వంద్వ క్షేత్ర సిద్ధాంతపు..."

"ఒస్తున్నానోయ్. తొందర పడకు. ద్వంద్వ క్షేత్రాలంటే ఏమిటి? గురుత్వ క్షేత్రం, విద్యుదయస్కాంత క్షేత్రం. ఈ రెండింటిని కలిపి ఒకే ఒక సమీకరణం ద్వారా వర్ణించాలని అయిన్‌స్టయిన్ కలలు కని, కని కన్ను మూసేరు. అయిన్‌స్టయిన్ తర్వాత ఎంతో మంది ప్రయత్నం చేసి విఫలులయారు. కారణం ఏమిటని ఎప్పుడయినా ఆలోచించేవా? ..."

ఆలోచించ లేదని బుర్ర అడ్డుగా ఆడించేను.

"ఎండ లేకుండా నీడ లేదు. చావు లేక పోతే పుట్టుక లేదు. బొమ్మ లేక పోతే బొరుసు లేదు, ..."

నా మనస్సులో గభిమని ఒక ఆలోచన మెరిసింది. "ఒక నాణేనికి బొమ్మ, బొరుసు ఎలాగో, ఈ విశ్వానికి గురుత్వక్షేత్రం, విద్యుదయస్కాంత క్షేత్రం అలాగ అని మీరు అంటున్నారా?"

''అవును. సూక్ష్మంగా అదీ కథ. సంగతి సందర్భం అనుకూలిస్తే ఈ రెండు క్షేత్రాలనీ ఒకదానికి విరుగుడుగా మరొకదానిని వాడి, రబ్బరు గుడ్డలా ఉన్న విశ్వానికి పడ్డ లొత్తలు తీయ వచ్చు. కాని ఆ సంగతి, సందర్భం అనుకూలించడమే కష్టం. నిజానికి గురుత్వాకర్షణ శక్తిని అధిగమించడానికి అనంతమయిన విద్యుదయస్కాంత శక్తి కావలసి ఉంటుందని నా అంచనా.''

''అనంతమయిన విద్యుదయస్కాంత శక్తి అక్కర లేదు. సాంతమయిన శక్తితోటే ఆ పనిని సాధించ వచ్చని రమేష్ అంటున్నా...''

''డబ్బంటే మస్తుగా ఉందేమో కాని పై అంతస్థులో సరుకు లేదోయ్. కాకి పిల్లకి ఏమి తెలుసోయ్ ఉండేలు దెబ్బ. అయినా నాకు తెలియక అడుగుతాను, ఆ రమేషుకి భౌతిక శాస్త్రం ఏమిటి వచ్చా అని. మనలో మన మాట. ఆ రమేష్‌కి ఆంధ్రా యూనివర్శిటి వారు డిగ్రీ ఇవ్వకుండా పంపించేసేరు, తెలుసా?''

అయితే రమేష్ చెప్పేవన్నీ ప్రగల్భపు పలుకులే అంటారా? ఏంటీ గ్రేవిటీ అసాధ్యం అంటారా?''

''మానవుడి బుర్రకి ఊహ తట్టాలే కాని, సాధ్యం కానిదేదీ లేదోయ్. 'అసాధ్యం అనే మాట నా నిఘంటువులో లేదోయ్. ఈ వేళ సాధ్యం కాక పోతే రేపు సాధ్యం కావచ్చు. అయిన్‌స్టయిన్ అసాధ్యం అనుకున్నది ఇప్పుడు సాధ్యం కాలేదూ? సిద్ధాంతం ప్రకారం ఏంటీ గ్రేవిటీ... అసాధ్యంలా... కనిపిస్తోంది... బొడ్డూడని వాళ్లంతా భౌతిక శాస్త్రవేత్తలమే అంటే ఇలాగే

నా పత్రికకి కావలసినది, ప్రజలు ఎగిరి పడి చదవగోరేదీ అయిన కథా వస్తువు, సామగ్రి మిడతంభొట్లు నోటి నుండి వచ్చింది. మేష్టారి దగ్గర సెలవు తీసికొన్నాను.

మిడతంభొట్లుకి పుస్తకాల పరిజ్ఞానం తప్ప ప్రపంచ జ్ఞానం లేదని రమేష్ అంటాడు. పొగరుతో ప్రగల్భాలు పలుకుతాడు తప్ప రమేష్‌లో పస లేదని మిడతంభొట్లు అంటారు. అయినా ఇద్దరూ ముఖాముఖీ కలుసుకున్నప్పుడు ఒకరి యెడల ఒకరు పరస్పరం గౌరవంగానే ఉంటారు. అంతెందుకు? ఇప్పటికీ వీలయినప్పుడల్లా ఇద్దరూ కేరం బోర్డు ఆడుతూనే ఉంటారు.

పత్రికలలో నా 'కాలం' రాసేసి మరేదో పనిలో మునిగి పోయాను. ఇట్టే మూడు నెలలు తిరిగి పోయాయి. నేను రాసినది చదివిన దగ్గరనుండి రమేష్ కారాలూ, మిరియాలూ నూరేస్తున్నాడని చూచాయగా విన్నాను. 'ఏంటీ గ్రేవిటీ ఇంజను నిర్మించి తీరతాను' అని శపథం పట్టేడుట. ఆ ఇంజనుని మిడతంభొట్లు సమక్షంలోనే పరీక్ష చేసి తన సత్తా నిరూపించుకుంటానని సవాలు కూడా చేసేట్ట.

ఇదే మంచి అవకాశమని రమేష్‌తో ఒక ఇంటర్వ్యూ సంపాదించేను. ఏంటీ గ్రేవిటీ ఇంజను మీద పని ఎలా జరుగుతోందో కనుక్కోవాలని నా ఆశ. ఆయన ఆఫీసులో అర గంట

సేపు పడిగాపులు పడి ఎదురు చూడగా, చూడగా ప్రత్యక్షమయ్యేడు. పత్రికలవారితో పేచీ పెట్టుకునే తత్వం కాదు రమేష్‌ది. ఆలస్యం అయినందుకు క్షమార్పణ చెప్పుకున్నాడు. అతని వాలకం చూస్తే ఏంటీ గ్రేవిటీ ఇంజను ఇబ్బందిలో పడిందేమోనని అనుమానం వేసింది. ఆ విషయమే అడిగేను.

"ఎవరు చెప్పేరు? ఆ నిడసనమెట్ల వాడేనా?"

"రమేష్‌కి కోపం వచ్చినప్పుడు మిడతంభొట్లుని నిడసనమెట్ల వాడనో , పెట్టిన పేరుతో రామదాసు అనో సంబోధించడం కద్దు. అందుకనీ, ఎందుకేనా మంచిదనీ,

"ఎవరూ కాదండి. ఏదో కర్ణాకర్ణిగా విన్నదేనండి."

"నీ శృత పాండిత్యం అంతా ఆ మిడతంభొట్లు దగ్గరనుండి సంక్రమించినదే. ఏంటీ గ్రేవిటీ సంభవమో, అసంభవమో నీ కళ్ల ఎదుటే రుజువు చేస్తాను, రా" అని జబ్బ పుచ్చుకుని నన్ను పై అంతస్తులో ఉన్న ప్రయోగశాల లోనికి లాక్కెళ్లేడు.

రమేష్ అమర్చిన ప్రయోగం చాల క్లిష్టమయినది. చాల చాకచక్యంతో చేసేడని ఒప్పుకోవాలి. భౌతిక శాస్త్రంలో బాగా ప్రవేశం ఉన్నవాళ్లకి తప్ప సామాన్యులకి గభిమని అర్థం కాదు. అయినా టూకీగా  చెబుతాను. రెండు బలమయిన విద్యుదయస్కాంతాల మధ్య విద్యుదయస్కాంత క్షేత్రం ఒకటి సృష్టించేడు. ఆ అయస్కాంతాల మధ్య భూమి యొక్క ఆకర్షణ క్షేత్రం ఎలాగూ ఉండనే ఉంది. భూమి యొక్క ఆకర్షణ శక్తిని ఆయస్కాంతాల శక్తితో రద్దు చెయ్యాలి. అది ఎంత రద్దయిందో కొలవడానికి ఒక పరికరం కావాలి కదా? అందుకని ఆ అయస్కాంతాల మధ్య ఒక మాస్‌బావర్ ఎఫెక్టు త్రాసుని కూడా అమర్చేరు./ అంటే మరేం కాదు. సంబద్ధమయిన గామా కిరణవారాన్ని ఒక దానిని భూమ్యాకర్షణ క్షేత్రం గుండా పంపుతారు. ఆకర్షణ క్షేత్రంలో ఏదయినా మార్పు కలిగితే, తత్ ఫలితంగా గామా కిరణాల తరంగ దైర్ఘ్యం మారుతుంది. ఆ మార్పుని కొలచి ఆకర్షణ క్షేత్రంలోని మార్పుని లెక్క గట్టి, తద్వారా ఏంటీ గ్రేవిటీ క్షేత్రం యొక్క బలాన్ని కొలవచ్చు.

నాకు భైతిక శాస్త్రంలో ప్రావీణ్యం లేక పోయినా కొద్ది పరిచయం ఉంది. విజ్ఞాన విలేఖరిని కదా. అందుకని దేశ దేశాలలో జరిగే విషయాలని చదువుతూ ఉంటాను. రమేష్ చూపిస్తూన్న ప్రయోగంలో పెద్ద కొత్తదనం ఏదీ లేదు. ఉరమరగా ఇలాంటి అమరికనే ఉపయోగించి అమెరికాలో ఆమధ్య గురుత్వాకర్షణని ఇరవై రెండు శాతం తగ్గించేరు. ఆ విషయమే అడిగేను.

"గురుత్వాకర్షణని ఇరవై రెండు శాతం తగ్గించడానికి అమెరికా వారు ఎంత శక్తి వెచ్చించేరో తెలుసా? అంత విద్యుశ్చక్తి వెచ్చించకుండా మా ప్రయోగం చాల సమర్ధవంతంగా చేసేం. కావలిస్తే..."

"ఇరవై రెండు శాతం తగ్గించడం పెద్ద గొప్పేమీ కాదు. మీరు గురుత్వాకర్షణని పరిపూర్ణంగా నాశనం చెయ్య గలరా? అదీ అసంభవమని మిడతంభొట్లు అన్నట్లు నాకు గుర్తు."

రమేష్ ముఖం జేవురించింది.

''ఈ సిద్ధాంతాలూ, సమీకరణాలూ, వీటిని ప్రతిపాదించే సిద్ధాంతులూ, ఉప సిద్ధాంతులూ అంటే నాకు ఒళ్లు మంట. ఏవో రెండు సమీకరణాలు రాసి, వాటిని ఎవ్వరూ చదవని ఒక అనామకమైన పత్రికలో ప్రచురిస్తే సరిపోయిందా? ప్రజలు వాడుకుందికి వీలయిన విషయం ఒక్కటి కనిబెట్టేడుటయ్యా, మీ మిడతంభొట్లు? అక్కరకు రాని విద్య, అడవి గాసిన వెన్నెల అన్నారు. చేతనైన వాళ్లు చేసి చూపిస్తారుట, చేతకాని వాళ్లు పాఠాలు చెప్పుకుంటారుట. చూడు, మా రసాభౌకంలో ఎన్ని ఉపకరణాలు చేసి చూపిస్తున్నామో. అందుకే మిడతంభొట్లుకి నేనంటే అంత ఈర్ష్య. అయినా నేనే మనలో మనకి స్పర్ధలు ఎందుకని అవకాశం వచ్చినప్పుడల్లా అతనితో కేరమ్స్ ఆడుతూ ఉంటాను.''

''మీరు ఎప్పుడూ చిత్తుగా ఓడిపోతూ ఉండేవారట, నిజమేనా?''

మరీ కోపంతో రెచ్చి పోవడం పబ్లిసిటీకి మంచిది కాదని రమేష్‌కి తెలుసు. కొంచెం తమాయించుకొని, ప్రయత్నం మీద చిరునవ్వు తెచ్చుకుని,

''ఆ మరీ బడాయిలు. నా వంతు నేనూ గెలిచేను. నేను గప్పాలు కొట్టుకోను, అంతే. ఏదో వాడికి లెక్కలు, సైన్సూ బాగా వచ్చేవి. మనలో మనమాట. సోషల్ స్టడీస్‌లో మిడతంభొట్లు సున్నప్పిడతే. ఏదో ఆ మద్దాల గంగారామయ్యగారు జాలి పడి పేసు మార్కులు ఇచ్చేవారు.''

మనిషిని కుక్క కరిస్తే అది వార్త కాదు. కుక్కని మనిషి కరిస్తే అది పతాక శీర్షికని అధిష్టించ వలసిన వార్త. ప్రజలు పత్రికలు కొనాలంటే కథలో మసాలా ఉండాలి. అందుకని,

''మీరు పట్టభద్రులు కాలేదుట, నిజమేనా?''

''ఇదీ ఆ మిడతంభొట్లే కూసేడూ? అసలు విషయం చెబుతా, రాసుకో. ఎందుకోయ్ ముష్టి డిగ్రీలు. వెధవ డిగ్రీ వచ్చిందంటే ముష్టెత్తుకుందికి కూడ వీలు లేదు. మధ్యలో నామోషీ అడ్డొస్తుంది. అందుకని నేనే చదువు మానేసేను. ఇప్పుడు చూడు. నాకంపెనీలో ఎంతమందికి ఉద్యోగాలిచ్చి ఉపాధి కల్పిస్తున్నానో. ఆ మిడతంభొట్లు నోబెల్ బరుమానం ఎవరికి ఏమి ఒరగబెట్టిందని?''

ఈ రోజుకి ఇంటర్‌వ్యూ అయిపోయినట్లే. ఆఖరు మాటగా.

''మరయితే ముడతలు పడ్డ మిడతంభొట్లుగారి జంబుఖానాని మీరు ఇస్త్రీ చెయ్యలేక పోయారని రాసెయ్యమంటారా?''

'' 'ధీరుల్ విఘ్న నిహస్యమానులగుచున్ ధృత్యున్నతోత్సాహులై, ప్రారబ్ధార్థములుజ్జగింపరు సుమీ ప్రజ్ఞానిధుల్ కావునన్.' అని అన్నాడు కదోయ్, కవి. కనుక రబ్బరు జంబుఖానా మీద లొత్తలు తియ్యడానికి అనంత పద్మనాభుడు అంతరిక్షం నుండి దిగి రానక్కర లేదు. ఇస్త్రీ పెట్టెతో మా ఊరు మడేలు వస్తే చాలని మిడతంభొట్లుతో చెప్పు.''

ఏడాది గడిచి పోయింది. ఆ రోజు వచ్చిన ఉత్తరాలలో ఒక శుభలేఖ ఉంది - రసాభౌకం నుండి. ఏమిటి చెప్మా అనుకుంటూ విప్పి చూస్తే అదొక ఆహ్వాన పత్రిక. ఏంటీ గ్రేవిటీ యంత్రం పురప్రముఖుల ఎదుట, పత్రికా విలేఖరుల సమక్షంలో, ప్రప్రథమంగా ఆవిష్కరణ! ఈ సంరంభానికి ముందు ఒక గంట సేపు కాక్‌టెయిల్ పార్టీ!!

ఏమీ లేకుండా ఇంత ఆర్భాటం చెయ్యడానికి ఎన్ని దమ్ములుండాలి? వెంటనే మిడతంభొట్లు గారికి కూడ ఆహ్వానం వచ్చిందా అని వాకబు చేసేను. వచ్చిందిట. ఆయన ఏదో సాకు చెప్పి తప్పించుకుంటాడని అనుకున్నాను. తప్పకుండా వస్తానన్నారు.

ముహూర్తపు రోజు రానే వచ్చింది. రసాభౌకం ప్రాంగణం చాల కోలాహలంగా ఉంది. నేను వెళ్లేసరికి పత్రికా విలేఖరులు, ఫొటోగ్రాఫర్లతో కాక్‌టెయిల్ పార్టీ కిటకిటలాడుతూ కలకల్లాడి పోతోంది. రాజకీయ నాయకులు అప్పనంగా దొరికిన మందుని అప్పటికే రెండు మోతాదులు పుచ్చుకున్నారేమో, మేఘాలమీద ఉన్నారు.

ఈ లోగా రమేష్ అక్కడ ఉన్న వేదికని సమీపించి ఆహూతులందరినీ ఆహ్వానించేడు. ప్రపంచాన్ని దిక్‌భ్రమ చెందించే అపురూపమయిన ప్రయోగాన్ని పరికించబోతున్నారనీ, ఇది చరిత్రనే సృష్టించ బోతూన్న సందర్భమనీ , ముచ్చటగా మూడు మాటలతో స్వాగతం చెప్పేడు. వేదిక దిగబోతూ, చటుక్కున ఏదో జ్ఞాపకం వచ్చిన వాడిలా ఆగి, వెనక్కి తిరిగి మరో రెండు మాటలు చెప్పేడు.

"ఈ రోజు మీరు తిలకించబోయే ప్రయోగానికి మూలాధారం మన మిడతంభొట్లు మేష్టారి ద్వంద్వ క్షేత్ర సిద్ధాంతం. ఆ సిద్ధాంతంలోని మెళుకువలన్నీ అవగాహన చేసికొని, ఆయన అసంభవమని హెచ్చరిస్తూ ఉన్నా అధైర్యపడకుండా మేము ఈ ఏంటీ గ్రేవిటీ ఇంజనుని నిర్మించేం. కనుక నా చిన్ననాటి స్నేహితుడు, మా ఊరు వాడు, నోబెల్ గ్రహీత అయిన శ్రీ మిడతంభొట్లు మేష్టారిని ఈ ఆవిష్కరణ చేయవలసిందిగా కోరుతున్నాను."

సావడి అంతా కరతాళ ధ్వనులతో మోగి పోయింది. అనుకోకుండా వచ్చిన ఈ ఆహ్వానానికి ఎలా స్పందించాలో తెలీక, కొద్దిగా తికమక పడి, అవకతవకగా కుర్చీలోంచి లేచి, రమేష్ వైపు నడచి వెళ్లేరు మిడతంభొట్లు. అంత వరకు అడ్డుగా ఉన్న తెర తెరచుకొంది. అక్కడ ఒక కేరం బోర్డు! ఆ కేరం బోర్డుకి నాలుగు మూలలా నాలుగు జేబులతో పాటు, నడి మధ్యలో వృత్తాకారంలో ఒక విశాలమయిన బెజ్జం దొలచబడి ఉంది. ఆ బెజ్జానికి కింద బలిష్టమయిన విద్యుదయస్కాంత ధ్రువం ఒకటి ఉంది. దానికి జవాబుగా పైనుండి మరొక ధ్రువం వేలాడుతోంది. ఆ కేరం బోర్డు చుట్టూ రకరకాల ఎలక్ట్రానిక్ పరికరాలు ఎన్నో ఉన్నాయి. ఈ ప్రయోగానికి విద్యుశ్చక్తి ఎంత ఖర్చు అవుతోందో , ధ్రువాల మధ్య విద్యుదయస్కాంత క్షేత్రం యొక్క బలం ఎంతుందో, గురుత్వాకర్షణ క్షేత్రం బలం ఎంతుందో, వగయిరా సాంకేతిక విషయాలన్నిటిని ఆహూతులకి అర్థం అయే రీతిలో టెలివిషన్ తెరలమీద ప్రదర్శించడానికి ఏయే ఏర్పాట్లు ఎలా చేయబడ్డాయో, మొదలయిన విషయాలన్నిటిని

రసాభౌకంలో పని చేసే ఒక కోకిలమ్మ విశదం చేసింది. ఈ అట్టహాసానికీ, ఆర్భాటానికీ అరగంట పైగా పట్టింది. అసలు ప్రయోగం అర నిమిషంలో అయిపోతుందని నాకు తెలుసు.

''ఈ అయస్కాంత ధ్రువాల మధ్యనున్న భూమ్యాకర్షణ శక్తిని ఏష్యం చెయ్యడమే ఇప్పుడు చెయ్యబోతూన్న ప్రయోగం యొక్క లక్ష్యం'' అని అంటూ, మిడతంభొట్లు వేపు చూస్తూ రమేష్ మీట నొక్కేడు.

మిడతంభొట్లు సిద్ధాంతాలన్నీ అజగళ స్తనాలు, తన ప్రయోగాలన్నీ ప్రజోపయోగాలు అనే అర్థం స్ఫురించిందా చూపుల్లో. పచ్చి వెలక్కాయ గొంతుకకి అడ్డు పడ్డట్టు ఉండి ఉంటుంది, మేష్టారికి. మాస్‌బావర్ త్రాసు సహాయంతో గురుత్వాకర్షణ శక్తి ఎంత జోరుగా క్షీణిస్తున్నాదో లెక్క గట్టి ఆ లెక్కని టెలివిషన్ తెరల మీద చూపుతున్నారు. అందరూ కళ్లప్పగించి టెలివిషన్ తెరల వైపే చూస్తున్నారు. పదిహేను శాతం, నలభై శాతం, ఏభై రెండు శాతం, ... అయస్కాంతాల మధ్య గురుత్వాకర్షణ శక్తి పడిపోతోంది. మిడతంభొట్లు ముఖం కత్తి వేటు వేసినా నెత్తురు చుక్క లేనట్టు పాలిపోయింది.

ఉత్కంఠని పెంచడానికా అన్నట్లు రమేష్ ఏవేవో మీటలని నొక్కుతున్నాడు. ఆ చర్యల వల్ల ప్రయోగం యొక్క జోరు కొంచెం తగ్గింది. గురుత్వాకర్షణ క్షేత్రం యొక్క బలం పడుతోంది కాని, ఆ పతనం యొక్క జోరు తగ్గింది.

''మీ అందరికి అర్థం అవడానికి సదుపాయంగా ఉంటుందని ప్రయోగం జోరు తగ్గించేం. అనతి కాలంలో గురుత్వాకర్షణ క్షేత్రం యొక్క శక్తి పూర్తిగా నశిస్తుంది. అప్పుడు ఆ అయస్కాంతాల మధ్యనుండి అత్యూదమయిన కాంతి ఉద్భాసిస్తుంది. దాని నుండి మీ కళ్లని రక్షించుకొనడానికి మీమీ కుర్చీల పక్కని ఉన్న సంచులలో ఉన్న చలవ కళ్లద్దాలు తీసి ఇప్పుడు మీరు ధరించండి.'' మళ్లా ఇందాకటి కోకిల హెచ్చరించింది.

అందరూ ఊపిరి బిగపట్టుకుని కుర్చీల మొనల మీద కూర్చుని ఉన్నారు. కొద్ది క్షణాలలోనే గురుత్వాకర్షణ శక్తి పూర్తిగా నశించి పోయింది. అదే వేళకి గదిలో దీపాలు ఆర్పేసినట్లున్నారు. కేరం బోర్డు మధ్యలో విద్యుదయస్కాంత క్షేత్రం వింతయిన కాంతులీనుతూ కనిపించింది. గదిలో గాలికి కూడ ఏదో వింతయిన తావి అబ్బినట్లయింది. మిడతంభొట్లు ముఖ కళవళికలు ఆ చీకట్లో, ఆ నల్ల కళ్లద్దాల వెనక నుండి కనిపించడం లేదు కానీ, మనిషి మాత్రం ఏదో తీవ్రమయిన ఆలోచనలో మునిగి పోయినట్లు కనబడ్డాడు.

''ప్రయోగం ఇంకా అయిపోలేదు.'' రమేష్ గొంతుక వినిపించింది.

''ప్రస్తుతం మనం సాధించినదల్లా అయస్కాంతాల మధ్యనున్న స్థలంలో గురుత్వాకర్షణని నశింపజేశాం. అంతే. ఇంతటితో ఈ ప్రయోగాన్ని ఆపేసే మనిషినయితే నేనూ ఏ విశ్వవిద్యాలయంలోనో అధ్యాపకుడుగా ఉండేవాడిని.'' అంటూ మితడతంభొట్లు వైపు అర్థగర్భితంగా ఒక తూరి దృష్టి సారించి, మళ్లా అందుకున్నాడు.

''గురుత్వాకర్షణ లేకపోయిన సందర్భాలని మనం ఎలా వినియోగించుకోగలం? అది నేను మీ అందరికి సాక్షాత్తూ చూపిస్తాను. కాని ఇది నేను నాచేతులతో చేస్తే నేనేదో మోళీ

కట్టేననో, కనికట్టు చేసేననో మీరు అనుకునే ప్రమాదం ఉంది. కనుక ఈ ప్రయోగాన్ని తన చేతుల మీదుగా పూర్తి చెయ్యవలసిందిగా నేను మన జాతికే వన్నె తెచ్చిన మిడతంభొట్లుగారిని అర్థిస్తున్నాను.''

కథనం ఇలా మళుపు తిరుగుతుందని మిడతంభొట్లు కలలో కూడ అనుకో లేదు. అకస్మాత్తుగా వచ్చిన ఈ ఆహ్వానంలోని అంతరార్ధం ఏమిటో ఆకళింపు చేసుకుందికి వ్యవధి లేదు. అప్రయత్నంగా లేచి, రమేష్ చూపించిన దారి వెంబడే యాంత్రికంగా నడుచుకుని వెళ్లి, కేరం బోర్డు పక్కన ఉన్న కుర్చీలో చతికిల బడ్డాడు. ఆయనకి ఎదురుగా ఉన్న కుర్చీలో రమేష్ కూర్చున్నాడు.

``గురుత్వాకర్షణ పూర్తిగా నశించిన ప్రదేశంలోనికి ఘన పదార్థాలని పంపితే వాటి ప్రవర్తన ఎలా ఉంటుందో అధ్యయనం చెయ్యడమే ఈ మొదటి ప్రయోగం యొక్క లక్ష్యం. మీకు కేరమ్స్ ఆట మీద ఉన్న వ్యామోహం విశ్వవిదితం. భౌతిక శాస్త్రం, కేరమ్స్ – ఈ రెండూ మీ జీవితానికి బొమ్మా, బొరుసూ లాంటివి. ద్వంద్వ క్షేత్ర సిద్ధాంతం మీ ముద్దుల బిడ్డ. ఆ సిద్ధాంతాన్ని మీ జీవిత కాలం లోనే సవరించ వలసి వస్తుందని సూచించే ప్రయోగం ఇది. ఏదీ, ఈ ఎర్ర బిళ్లని నెమ్మదిగా ఆ అయస్కాంతాల మధ్యకి, గురుత్వాకర్షణ నశించిన ఆ క్షేత్రం లోనికి, మీ చేతులతోటే ఒక చిన్న తోపు తొయ్యండి, ఏమవుతుందో చూద్దాం.'' అని మిడతంభొట్లుని ఉద్దేశించి రమేష్ అన్నాడు.

చలవ కళ్లజోడు వెనక దాగున్న ఆయన కళ్లు కనిపించి ఉంటే అవి ఏమిటి చెప్పి ఉండేవో?

రమేష్ పద్ధతి చెప్పేనుగా? పిక్కని కొట్టే ముందు ఏ పిక్క ఏ జేబులోకి వెళుతుందో చెబుతూ మరీ కొడతాడని. అదే ధోరణిలో, రమేష్ ప్రేక్షకులని ఉద్దేశించి, ``జాగ్రత్తగా గమనించి చూడండి. ఆ ఎర్ర పిక్క శూన్య క్షేత్రం చేరుకోగానే, దాని మీద భూమి యొక్క ఆకర్షణ ప్రభావం ఏమీ ఉండదు. అంటే, ఆ అయస్కాంతాల మధ్యకి వెళ్లగానే, మన ఎర్ర పిక్క కేరం బోర్డు మధ్యనున్న బెజ్జం గుండా కిందకి పడిపోకుండా ఒక్క క్షణం పాటు అలా తేలుతూ ఉంటుంది. భూమి ఆకర్షణ ....''

ఈ ప్రసంగం అంతా అయే వరకు మిడతంభొట్లు ఆగ లేదు. ఎర్ర పిక్కని ఒణుకుతూన్న వేళ్లతో నెమ్మదిగా రెండు అయస్కాంతాల మధ్యనున్న క్షేత్రం లోనికి తోసేడు. ప్రత్యర్థులిద్దరూ నా స్నేహితులే కనుక నేను ముందు వరసలో కూర్చునే చూస్తున్నాను. ఎర్ర బిళ్ల నెమ్మదిగా బోర్డు మధ్యనున్న బెజ్జం వరకు వెళ్లింది. ఆ బెజ్జం అంచు వరకు వెళ్లి, అక్కడ ఏమిటి చెయ్యడమా అని ఈషణ్మాత్రం తటపటాయించిందా అన్న సంశయం నా మనస్సులో పొడచూపింది. ఇంత కంటె ఆలోచించడానికి వ్యవధి లేదు. ఎర్ర బిళ్ల అకస్మాత్తుగా అదృశ్యం అయిపోయింది. ఎక్కడో దూరాన ఉరుము ఉరిమినట్లు శబ్దం ముందు వచ్చి, తర్వాత చిన్న మెరుపు మెరిసినట్లయింది. ఏదో కాలుతూన్నట్లు వాసన వేసింది.

ఏమయిందో అర్థం కాక కొందరు ఒక్కసారి లేచి నిలబడ్డారు. మధ్యనున్న బెజ్జం నుండి కింద పడిపోయిందేమోనని కొందరు ఎర్ర బిళ్ల కోసం తొంగి తొంగి బల్ల కింద చూస్తున్నారు.

రమేష్ మాత్రం స్థాణువులా, మాట్లాడుతూన్న వాక్యాన్ని మధ్యలో ఆపేసి, ఉలుకు, పలుకు లేకుండా, కూర్చున్న వాడు కూర్చున్న చోటే ఉన్నాడు. రమేష్ పక్కనే నిలబడి ఉన్నమన కోకిలమ్మ కెవ్వున కేక వెయ్యడమూ, కేరం బోర్డు రక్తసిక్త మవడమూ రెప్పపాటు కాలంలో జరిగి పోయాయి. రమేష్ హృదయ ఫలకంలో, గుండె నుండి వీపు దాకా, అంగుళం పొడుగు, పావు అంగుళం వెడల్పు, ఉండి దీర్ఘచతురస్రాకారంగా ఒక బెజ్జం పడి ఉంది. తర్వాత శవ పరీక్షలో తేలింది. ఏదో గుండ్రటిది, రూపాయి కాసు ఆకారం కలిగినది, తూటాలా ఆ గుండె కాయలోంచి దూసుకు పోయిందని.

ప్రయోగాన్ని అర్థాంతరంగా ఆపేసేరనీ, పోలీసులని పిలిపించేరనీ మళ్లా నేను చెప్పక్కర లేదనుకుంటాను. ప్రశ్నించడానికని మిడతంభొట్లునీ, వాగ్మూలాలకని వచ్చిన ఆహూతులలో చాలమందిని పోలీసులు ఠాణాకి తీసుకు పోయారు.

ఈ సంఘటన జరిగి మూడు నెలలు దాటిపోయింది. దర్యాప్తు ఎంతవరకు వచ్చిందని పోలీసులని ఎన్నిసార్లు అడిగినా వాళ్లు అంతా గప్‌చిప్ అని ఏమీ చెప్పడం లేదు. ఇందులో గప్‌చిప్‌కి రాచ రహస్యం ఏమీ లేదే? ఏదీ పాలు పోకుండా ఉంది. ఈ సందర్భంలో మిడతంభొట్లు నా కోసమని కబురంపేరు. ఆయనని కలుసుకుందికి వెళ్లేను.

ఆఫీసు తలుపు మీద ఆర్. నిడసనమెట్ల అని ఇంగ్లీషులో రాసి ఉంది. తలుపు తీసికొని లోపలకి వెళ్లేను. మనిషి కొద్దిగా చిక్కినట్లు కనిపించేడు. బడేమియా బట్టలు లేవిప్పుడు. ఉడతలు పీకిన తాట్టెంకలా జుత్తూ లేదు. సంరక్షణ చేసుకుంటే మనిషి స్ఫురద్రూపే. నన్ను చూడగానే ఆప్యాయంగా పలకరించేడు. ముక్తసరిగా మూడు నిమిషాలు కుశలప్రశ్నలు అయేయనిపించి, ఆయనే విషయం ఎత్తుకున్నాడు.

"ఆ వేళ ఏం జరిగిందో ఇప్పటికి అర్థం అయిందోయ్. ఆ వేళ బుర్ర జోరుగా పని చెయ్యలేదనుకో. ఆ ప్రయోగాన్ని రమేష్ అలా వర్ణించి చెబుతూ ఉంటే మంత్రముగ్ధుడిలా అతను చెప్పినట్లు చేసేసేను తప్ప ఒక్క క్షణం ఆలోచించి ఉంటే ఈ ఘోరమైనప్రమాదం జరిగి ఉండేది కాదోయ్. ఆలోచిస్తూ ఉంటే తప్పులో కొంత పాలు నేనూ పంచుకోవాలేమో అని అనిపిస్తున్నాదోయ్. ఏదో డాంభికంగా హడావిడి చేసేడే అనుకో. సిద్ధాంతం తెలిసిన వాడిని నేను. నేనయినా కొంచెం నిదానంగా ఆలోచించి ఉండవలసింది. జరిగిన దానికి ప్రాయశ్చిత్తం ఏమిటా అని ఆలోచిస్తున్నాను."

"గతజలసేతు బంధనం. ఇప్పుడు విచారించి ఏమి లాభం? మీ ఫిజిక్సు పోయిన వాడికి ప్రాణం పొయ్యలేదు కదా!"

``పొయ్యలేదు. నిజమే. కాని పాపం రమేష్ తన జీవితం అంతా తన కంపెనీకే ధార పోసేడు కదోయ్. కనీసం రమేష్ ఆఖరి కోరికని తీర్చడానికా అన్నట్లు ఇప్పుడు రసాభౌకం యొక్క అధిష్ఠాన వర్గానికి అధ్యక్షుడుగా చేరేనోయ్. ఆవేళ జరిగిన అభాసు వల్ల కంపెనీ పరపతికి ఎంత చిన్నతనం! ఎంత చిన్నతనం!! అసలు ఆ వేళ జరిగిందేమిటో ప్రజలందరికి అర్థమయే రీతిలో రాసి విపులీకరించే స్థోమత నీ కొక్కడికే ఉందోయ్. అందుకనే నిన్ను పిలిపించేను.''

సంభాషణ ధోరణి ఇలా మళుపు తిరుగుతుందని నేను కలలో కూడ అనుకో లేదు. కాని నేను చెయ్యవలసినదేమిటో నాకు బోధ పడలేదు. ఇంతలో ఆయనే మళ్లా చెప్పడం కొనసాగించేరు.

``ఒట్టి చొప్పదంటు సిద్ధాంతాన్ని ఆధారంగా చేసికొని ఆ ప్రయోగాన్ని తలపెట్టేడోయ్. లేకపోతే ఏమిటి చెప్పు? గురుత్వ క్షేత్రం రద్దవగానే బిళ్ల బరువుని కోల్పోయి గాలిలో తేలిపోతుందని కదూ అన్నాడు? రాకెట్టులో మనుషులు తేలిపోతూన్నట్లు సినిమాలలో చూసుంటాడు. గురుత్వ క్షేత్రం నశించి నప్పుడు వస్తువులు అలా తేలిపోతాయని చాలమంది అనుకుంటారు. నిజానికి రాకెట్టూ, రాకెట్టు లోని మనిషీ – రెండూ ఒకే సారి – భూమి గురుత్వ క్షేత్రంలో పడుతూ ఉంటే బరువుని కోల్పోయినట్లు అనిపిస్తుందంతే. అది శుద్ధ భ్రమ. నిజానికి భూమి గురుత్వ క్షేత్రంలో మార్పు ఏమీ లేదు. అదే విధంగా ... చూడవోయ్, ఈ కథనానికి చాల సేపు పడుతుంది. టూకీగా చెబుతాను. కావలిస్తే రాసుకో.

``నిజానికి రమేషు గురుత్వ క్షేత్రాన్ని నాశనం చేసేడు. కాని దాని పర్యవసానంగా ఎర్ర బిళ్ల తేలడం కాదు – పూర్తిగా తన భారాన్ని కోల్పోయింది. ఎర్ర బిళ్లే కాదు. ఆ అయస్కాంతాల మధ్యనున్న పదార్థాలన్నీ, అంటే గాలి బణువులూ, ధూళి రేణువులూ – సమస్తం – తమ తమ భారాలని పోగొట్టుకున్నాయి. నేను ఆ ఎర్ర బిళ్లని ఆ క్షేత్రంలోకి ఇలా తోసేనో లేదో, అలా ఉత్తర క్షణంలో దాని భారం శూన్యం అయిపోయింది. శూన్య భారం ఉన్న పదార్థం ఏదయినా సరే ఒకే విధంగా ప్రయాణం చేస్తుంది.''

క్లాసులో పాఠం చెబుతూ, కుర్రాళ్లు సమాధానం చెబుతారేమోనని ఆగినట్లు మితడంభొట్లు ఆగి, ప్రశ్నార్థకంగా నావేపు చూసేరు. ఆయన ఏదయినా ప్రశ్న వేస్తారేమోనని భయపడి, ఎందుకేనా మంచిదని, నేనే అడిగేసేను. ``ఏ రకంగా ప్రయాణం చేస్తుందంటారు?''

``శూన్య భారం ఉన్నది ఏదయినా సరే కాంతి వేగంతో ప్రయాణం చేస్తుందని చదువుకోలేదుటోయ్? ఫోటానులకి భారం లేదు. అవి కాంతి వేగంతో ప్రయాణం చేస్తాయి. అసలు ఫోటానులంటేనే కాంతి. అలాగే ఎర్ర బిళ్ల ఏంటీ గ్రేవిటీ క్షేత్రంలో ప్రవేశించగానే, తన భారాన్ని కోల్పోయి, కాంతి వేగాన్ని అందుకొని, ఝూంమ్మని గగన వీధి లోకి దూసుకు పోయింది. పోతూ, దారిలో రమేష్ శరీరం అడ్డొస్తే, అతని గుండెల్ని చీల్చుకుని పోయింది.''

నాకొక చిన్న ధర్మ సందేహం వచ్చింది. తెగించి అడిగేసేను.

''అయస్కాంతాల మధ్యలోనే కదా గురుత్వ క్షేత్రం నశించింది? ఆ పరిధిని దాటి బయటకు రాగానే బిళ్ల బరువు తిరిగి బిళ్లకి వచ్చేయాలి కదా? అప్పుడు అది కాంతివేగంతో ఎలా వెళుతుంది?''

ఏ మాటకి ఆ మాట చెప్పుకోవాలి. నా ప్రశ్న నాకే ఎంతగానో నచ్చింది. మేష్టారికి కూడ ఎంతగానో నచ్చి ఉండాలి. నా మీద చిరాకు పడకుండా తల పంకించి సమాధానం చెప్పేరు.

''నిజమే. జోరుగా వెళుతూన్న సైకిలుకి ఎంత గట్టిగా మరకట్టు వేసినా అకస్మాత్తుగా ఆగలేదు కదా. అలాగే ఎర్ర బిళ్ల శూన్య భారం తోటీ, కాంతి వేగం తోటీ ప్రయాణం మొదలు పెట్టింది కదా. అయస్కాంతాల మధ్యనున్న శూన్య క్షేత్రం దాటి బయటకు వచ్చి రావడంతో దాని నిజ భారం దానికి వచ్చేసింది. ఈ సందర్భంలో దాని వేగం తగ్గాలి. కాని ఈ జోరు అకస్మాత్తుగా తగ్గ లేదు. తగ్గడానికి నిర్దిష్టమైన కాలం కొంత పడుతుంది. ఈ వ్యవధి ముగిసే లోగా మన ఎర్ర పిక్క భూమ్యాకర్షణ క్షేత్రం లోంచి - ఆ మాట కొస్తే, సూర్య మండలం లోంచి - దాటి బయటకి ఎక్కడికో వెళ్లి పోయి ఉంటుంది. విశ్వాంతరాళం అంతా దరిదాపు శూన్యమే కనుక, మన వాతావరణం దాటగానే మన ఎర్ర పిక్క మీద ఒరిపిడి శక్తుల ప్రభావం కూడ మూడొంతులు ...

'గుడ్డిలో మెల్ల. మనం అదృష్టవంతులం అనుకో. ఆ ప్రయోగం మూడో అంతస్థు మేడ మీద జరిగింది కనుక సరిపోయింది కానీ, నేల మట్టంలో జరిగుంటే ఆ ఎర్ర పిక్క మరెంతమంది గుండె కాయల్ని చీల్చుకుని, మరెంతమందిని పొట్టలో పెట్టుకుని ఉండేదో...''

నాకు మరొక అనుమానం వచ్చింది. తీర్చేసుకుందామని అడిగేను.

''మరయితే ... ఆ ఎర్ర బిళ్ల రమేష్ సృష్టించిన క్షేత్రంలోనికి అతి నెమ్మదిగా వెళ్లింది. అసలు కేరం బోర్డు మధ్యలో ఉన్న బెజ్జం దగ్గర ఆగిపోయిందేమోనని అనుమానం కూడా వేసింది. ఆటువంటి సందర్భంలో దానికి అకస్మాత్తుగా కాంతి వేగం ఎలా ఆపాదించబడింది?''

''భౌతిక శాస్త్రంలో ఇంత ప్రవేశం నీకెప్పుడు వచ్చిందోయ్? నా క్లాసులో కుర్రాళ్లు ఇంత మంచి ప్రశ్నలు ధైర్యంగా అడిగి ఉంటే మన దేశానికి మరొక నోబెల్ బహుమానం వచ్చి ఉండేదోయ్.

''అడిగేవు కనుక చెబుతాను విను. ఇది కొంచెం క్లిష్టతరమైన ఊహనం. గభిమని అర్థం కాక పోతే కంగారు పడకు. రమేష్‌కి సిద్ధాంతం అర్థం కాకపోయినా, తంతే బూర్ల గంపలో పడ్డట్టు పడ్డాడు. వ్రతం చెడ్డా ఫలం దక్కింది. మన జంబుఖానా నమూనా ఉంది చూడు. ఆ జంబుఖానాలో పడ్డ లొత్తని తీసెయ్య గలిగేడు. లొత్తలు లేని క్షేత్రంలో అయిన్‌స్టయిన్ సాధారణ సాపేక్ష సిద్ధాంతం వర్తించదు. అప్పుడు నిహిత నియమాలు కూడ వర్తించవు. ఆ సందర్భంలో అతను సృష్టించినది సతత గతి యంత్రం. ఈ యంత్రంతో అపరిమితమైన శక్తిని ఉత్పాదించ వచ్చు.

''ఈ సూత్రాలని ఉపయోగించి శక్తిని నిరంతరాయంగా సృష్టించే సావకాశాలు ఉన్నాయి. అప్పుడు మన దేశంలో ఖనిజపు చమురు, రాక్షసి బొగ్గు నిల్వలు తక్కువని చింతించ నక్కర లేదు. తెలిసీ తెలియని మిడి మిడి జ్ఞానంతో రమేష్ గుడ్డి గుర్రపు తాపులా కనిపెట్టినది ఏంటీ గ్రేవిటీ కాదు. పెట్టుబడి పెట్టిన శక్తి కంటె దాని మీద వచ్చే రాబడి శక్తి ఎక్కువగా ఉత్పత్తి చెయ్యడం ఎలానో కనిపెట్టేడు. ఆ పని పూర్తి చెయ్యడానికి రమేష్ కంపెనీలో నన్ను మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉండమని అతని వారసులు బతిమాలేరు. కాదనలేక పోయాను.''

''మేష్టారూ, మీరు చెప్పినవన్నీ బాగానే ఉన్నాయి. కానీ, ఆ వేళ జరిగిన ప్రమాదంలో మనలో ఎవ్వరిమైనా చచ్చిపోయి ఉండే వాళ్లం కదా? మరి ఆ ఎర్ర బిళ్ల గురి పెట్టి కొట్టినట్లు రమేష్ గుండెలని చీల్చుకుని వెళ్లడానికి కారణం?''

''దీపం వెలిగించినప్పుడు కోటానుకోట్ల ఫోటానులు ఉత్పత్తి అవుతాయి. ఫోటానులకి భారం లేదు. కనుక అవి అన్ని దిశలలోకి కాంతి వేగంతో చెల్లా చెదురవుతాయి. అప్పుడు వెలుగు అన్ని వేపులకి వ్యాపిస్తుంది. అంతే కాదు. భారం లేనివి కనుక ఈ ఫోటానులు ఎంత వేగంతో మనని ఢీకొట్టినా మనకి దెబ్బ తగలదు. అలాగే ఆ అయస్కాంత క్షేత్రంలో కోటానుకోట్ల గాలి బణువులు ఉన్నాయి. అవీ వాటి భారాన్ని కోల్పోయేయి. అప్పుడు అవీ ఫోటానులలాగే అన్ని దిశలకీ చెదిరి పోయాయి. కాని ఇక్కడ ఎర్ర బిళ్ల ఒక్కటే ఉంది. అది భారాన్ని కోల్పోయిన వెంటనే ఏ దిశలో బయటకు పోతుందన్న ప్రశ్న కోటి రూపాయల ప్రశ్న. కోట్ల కొద్దీ ఎర్ర బిళ్లలు ఉండి ఉంటే ఒకొక్క బిళ్ల ఒకొక్క దిశ లోకి వెళ్లిందనుకోవచ్చు. కాని ఇక్కడ ఒకే ఒక బిళ్ల ఉండడం వల్ల అది ఇదమిద్ధంగా ఫలానా దిశలో ప్రయాణం చేస్తుందని చెప్పలేం. ఇది యాదృచ్ఛిక ప్రక్రియ. ఎటేనా వెళ్లి ఉండ వచ్చు. మన రమేష్ రోజులు నిండుకున్నాయి. మనతో రుణానుబంధం తీరిపోయింది. ఆ బిళ్ల వెళ్లి అతనిని కొట్టింది. వెళ్లిపోయాడు.''

ప్రజలు, పత్తేదారులు, పోలీసులు, ప్రభుత్వం, అంతా ఈ సంజాయిషీని నమ్మేరు. నమ్మడమేమిటి? మిడతంభొట్లుని రమేష్ స్థాపించిన కంపెనీకి అధ్యక్షునిగా చేసేరు.

మిడతంభొట్లు చెప్పిన కథ, కథనం ఎంత పకడ్బందీగా ఉన్నట్టనిపించినా నాకు నమ్మబుద్ధి కాలేదు. నాస్తి గురుత్వ క్షేత్రం లోనుండి బయటకు రావడానికి ఎర్ర పిక్కకి దొరికిన దిశ రమేష్ కూర్చున్న వేపే దొరకాలీ, మరో మార్గం లేనట్లు. ఇది కాకతాళీయం అంటే ఎలా నమ్మడం?

బొంబాయి, బెంగుళూరు, కలకత్తా నగరాలలో భౌతిక శాస్త్రంలో నిష్ణాతులు చాల మంది ఉన్నారు. వారితో ఈ సందేహం వెలిబుచ్చేను. ఇదమిద్ధంగా ఎవ్వరూ చెప్పలేక పోయారు. రమేష్ చేసిన ప్రయోగాన్నే మరొకసారి చేసి, ఈ మారు ఎర్ర బిళ్ల ఎటు వేపు వెళుతుందో చూస్తే సరిపోతుంది కదా అని ఒక విద్యార్థి సలహా ఇచ్చేడు. కాని ఈ ప్రయోగం

చెయ్యగలిగే పరిజ్ఞానము, స్థోమత ఒక్క రసాభౌకం వారికే ఉన్నాయి. ఆ కంపెనీ అధినేత ఇప్పుడు మిడతంభొట్లు. ఆయన ఒప్పుకోవద్దూ?

అనుమానం పెను భూతం అన్నారు. బంకనక్కిరి కాయలా ఈ అనుమానం నా మస్తిష్కాన్ని దొలిచేస్తోంది. కేరమ్స్ ఆటలో మిడతంభొట్లు జగజ్జెట్టి. ఏ పిక్కని ఏ కోణంలో ఎంత గట్టిగా కొడితే అది ఎటు వెళుతుందో అన్న జ్ఞానం ఆయనకి వెన్నతో పెట్టిన విద్య. అటువంటి మిడతంభొట్లు మనస్సులో, ఆ కుర్చీలో కూచున్న సమయంలో, ఒక మెరుపులాంటి ఆలోచన వచ్చి ఉండొచ్చు. ఎర్ర పిక్కని ఏ కోణంలో కొడితే అది గురుత్వ క్షేత్రం నుండి రమేష్ వైపు ...

ఇది ప్రమాదం అంటారా? కాకతాళీయం అంటారా? ఖూనీ అంటారా?

(అయిజక్ అసిమావ్ రాసిన `బిలియర్డ్ బాల్` అనే కథ దీనికి ఆధారం)

(రచన ఫిబ్రవరి 1995 సంచికలలోనూ, ఆంధ్రప్రభ మే 1995 సంచికలలోనూ ప్రచురణ పొందింది)